# కొరగాని కొడుకు.

హేమంతఋతువులో హిమవత్ పర్వతంపై నిలబడవచ్చు – తుపాను ఉధృతంగా వున్నప్పుడు కల్లోల కెరటాలపై నిలబడవచ్చు – శుక్రగ్రహంపై పాదం మోపటం, మండుటెండలో మరుభూమిపై కాలు నిలపటం, కణకణలాడే నిప్పులపై అడుగుపెట్టటం అన్నీ అవలీలగా చెయ్యచ్చు. తాటిమీదన్నా నిలబడవచ్చుకానీ మాట మీద నిలబడలేం!
అయినా, మండోదరి బాట మీద కన్నా మాట మీద నిలబడుతుంది. మాట తప్పటమంటే మానభంగమయినంత బాధపడుతుంది. అలాంటి మండోదరికి మాట తప్పాల్సిన అగత్యం వచ్చింది.



# కొచ్చెర్లకోట వెంకట సుబ్బారావు

ఉద్యోగం కోసం ఇంటర్వ్యూకి హాజరయినప్పుడు ప్రశ్నలు అడిగారు–

"పెరుగుతున్న జనాభా అరికట్టాలంటే ఏంచెయ్యాలి?"

మండోదరి "ఆర్డినెన్స్ ద్వారా మగవాడి వివాహ వయస్సు 60 ఏళ్లని, ఆడపిల్ల వయస్సు 65 అని నిర్ణయించాలంది."

మండోదరి ఇచ్చిన సమాధానాలు ఇంటర్వ్యూ బోర్డుకి నచ్చాయి. ఆమెకు ఉద్యోగం వచ్చింది; ఆమె చెప్పిన ఆర్డినన్స్ షరతు మీద.

అయితే, మండోదరి మాట తప్పి ఇరవై ఐదుకే పెళ్లి చేసుకుంది. అందుకే ఉద్యోగానికి రాజీనామా ఇచ్చింది.

"మండూకం! దేశమంతా టన్నులకు టన్నులు నిరోధులు వాడుతూంటే, నువ్వు వద్దంటావేంటి?" కంగారుపడి అడిగాడు రామారావు ఓ రాత్రివేళ.

"పోనీ రిటైర్ అయ్యాంతర్వాత కందాం. మీరు ఇంటిపట్టున వుంటారు కాబట్టి సాకటం తేలిక" వ్యంగ్యంగా అంది.

"ఎందుకంత కోపం? పెళ్లయిన కొత్తల్లో నువ్వే అన్నావుగా కొంతకాలం ఫ్యామిలీ ప్లానింగ్ పాటిద్దామని!"

"అప్పుడు పొరుగువారు వేరు, ఇప్పుడున్న వాళ్ళు వేరు."

రామారావు ఉలిక్కిపడ్డాడు. పొరుగువారు మారేసరికి నిరోధ్ అవసరం ఎందుకు లేకుండా పోయిందో అర్థంకాలేదు. పైగా ప్రక్కవాటాలో దిగినవాడు ఎవరో పెద్ద ఆఫీసరు. అందమైన కారు, బొచ్చు కుక్కా అన్నీ వున్నాయి.


"అంతా నా ఖర్మ! మండోదరినయి వుండి రాముణ్ని చేసుకున్నానే, అదే నా ఖర్మ. ఇంతకన్నా ఏ రావణాసురుణ్నో చేసుకుంటే సుఖపడేదాన్ని. మీరు ఒట్టి అనుమానం పిశాచి."

"టి.వి. సీత, రాముణ్ణి వదిలేసి రావణునితో ఎగువ సభకు వెళ్లగా లేంది రామారావు మండోదరిని చేసుకుంటే తప్పా? నీ పాతివ్రత్యం మంట గలిసినట్టు ఎందుకంత గింజుకుంటావు?"

"అవునండి, పొరుగువారు అనగానే పెడర్థాలు లాగాల్సిందేనా. మీరేమన్నా పత్తిత్తులా! ఆవిడగారి వైపు చూస్తూ వాళ్ల బొచ్చుకుక్క మెడ నిమురుతారుగా?"

"అందుకని నువ్వు ఏకంగా పిల్లల్నే కంటానంటావా?"

"ఛీ! అది కాదు, వాళ్లబ్బాయి వున్నాడే, వాడు ఒట్టి తుంటరివాడు. మొన్న మన కిటికీ అద్దం బద్దలకొట్టాడు. మన స్కూటర్ సీటు చింపాడు. మన ఇంటికొచ్చినప్పుడల్లా సోఫాలో కూర్చుని ఫోమ్ బయటకు లాగుతాడు."



"దానికీ, నువ్వు పిల్లల్ని కనటానికీ సంబంధం ఏమిటి?" అసహనంగా అడిగాడు.

"నాకూ అలాంటి పిల్లాడు కావాలండీ!" ముద్దు ముద్దుగా అడిగింది.

"అలాంటి పిల్లాణ్ణి నీకు ప్రసాదించాలంటే నా వల్ల ఎక్కడవుతుంది మండూకం!" తల బాదుకున్నాడు రామారావు.

"ఆ 'చింటూగాడు' మన ఇల్లంతా కిష్కింధ చేస్తూంటే నేను చూస్తూ ఊరుకుంటానా? వాడి బాబులాంటి వాణ్ణి కని చూపిస్తాను" అంటూ మండోదరి శపథం చేసింది.

"పైగా ఏ త్రాష్టుడు కనిపెట్టాడో కానీ ఆడవాళ్లకు వున్న అవమానాలు చాలక గొడ్రాలన్న మరో బిరుదు భరించాల్సి వస్తోంది" అంటూ మండోదరి ఒక్కో కంటికి ఒక్కో కడివెడు కన్నీళ్లు కార్చింది.

"బాధపడకు మండూకం! పిల్లల్ని కనటం, కల కనటమంత తేలిక. అయితే చిక్కల్లా ఒక్కటే."

"ఏమిటి?"

"మనకు పుట్టేవాడు ఆ లత్తుకోరు ఆఫీసరు కొడుకంత త్రాష్టుడవుతాడని గ్యారంటీ ఏమిటి?"

"ఛీ... ఛీ... మీతో కాపరం చేసేకన్నా మా పుట్టింటికి పోయి అంట్లు తోముకు బ్రతకటం మేలు."

"మరప్పుడు నీ పుత్రకామేష్టి యాగం ఏమవుతుంది? నీ మాట సంగతేంటి?"

"బిడ్డల్ని కనటానికి భర్తే వుండాలన్న రూలేమయినా వుందా ఏమిటి? ఎంచక్కా టెస్ట్ ట్యూబు బేబీని కనకూడదా?"

"అందుకూ ఓ మగవాడుండాలి. పైగా మండోదరి మహా పతివ్రత. భర్త లేనిదే పిల్లల్ని కనదు. నా మాట విను. పుట్టింటి ప్రోగ్రాం వాయిదా వేసి పుత్ర కామేష్టికి సన్నాహాలు చెయ్యి" అంటూ మృదువుగా ఆమెపై చెయ్యి వేశాడు. మండోదరి మంచులా కరిగిపోతూ– "ఏమండీ! మనకూ చింటూ అంత ముదనష్టపువాడు పుడతాడాండీ!" అంది.

"నీ వింత కోరికతో నేను చస్తున్నాను. నువ్వు ఎలాంటి అనుమానం పెట్టుకోకు. మండోదరంటే ఎవరు? లంకను ఏలిన మహారాణి. రాక్షసుడు తప్పకుండా పుడతాడు" అంటూ అభయహస్తం ఇచ్చాడు.

"అభిమన్యుడు ఎలా అంతటివాడు అయ్యాడు? తల్లి కడుపులో వుండగానే అన్ని విద్యలూ నేర్చుకోలేదూ! అలానే మనం కూడా – పిల్లవాడు కడుపున పడగానే కల్లోలిత ప్రాంతాల కబుర్లు చెపుదాం, తెలుగు సినిమా టైటిల్స్, ముప్పై రోజుల్లో కరాటే పుస్తకం వినిపిద్దాం. కావాలంటే పేవ్‌మెంట్ రచనలు కోకొల్లలున్నాయి" అంటూ ధైర్యం చెప్పాడు.

"మనకు పుట్టబోయే బిడ్డకు 'శత్రు' అని పేరు పెడదామండీ."

"మన శత్రు ఓ గంట ఆఫీసరుగారి ఇంట్లో తిరిగి ఆడుకున్నాడంటే చాలు వాళ్ళ కార్పెట్ కాస్త మన కోనేరంత కంపు కొడుతుంది."

"అంతేనా, ఇంకేమన్నా కోరికలున్నాయా?"

"వాళ్ల గోడలు ఎలక్షన్ టైంలో మన గోడల్లా, వాళ్ల పెరడు పంజాబంత ప్రశాంతంగా, వాళ్ల కాపురం కాశ్మీరంత నెమ్మళంగా వుండేట్టు చేయాలని వుందండి"

"నీ కడుపు కడపంత ప్రశాంతంగా వుంది– ఇవన్నీ డైరీలో రాసిపెట్టుంచు పుట్టబోయే అవతార పురుషుడు నీకు జరిగిన అన్యాయాలకి తప్పకుండా ప్రతీకారం తీర్చుకుంటాడు."

మండోదరి కన్న కలలు ఫలించాయి.

"మనవాడు అందరిలా కాకుండా చకచకా ఎదిగిపోవాలండి."

"మన దేశంలో ధరల్లా."

"మనవాడు ఎవరింటికైనా వస్తున్నాడంటే వాళ్లు ఝుడుసుకు చావాలి."

"కర్ఫ్యూ టైంలో ఖాకీల్ని చూసినట్టు."

"అన్నప్రాశనకు వాడు కలం, పుస్తకం కాదు, చాకు–చైనూ పట్టుకోవాలి."

"బాంబులు కూడా పక్కన పెడదాం."

"అవునూ! నీ కడుపు గురించి చుట్టుపక్కలవాళ్లు ఏమీ అనుకోవటం లేదా?"

"మీరుండగా ఎవరో ఏమిటనుకుంటారు?"

"అది కాదు నా ఉద్దేశం. రేపు ఒకసారి డాక్టరు పరీక్ష చేయించుకుంటే మంచిది."

మర్నాడు ఇద్దరూ లేడి డాక్టర్ని కలిశారు. ఆవిడే అన్ని పరీక్షలూచేసి "మీకు కడుపు వచ్చిన మాట నిజమేగానీ, పెరుగుతోంది పిల్ల కాదు, బల్ల" అని చెప్పేసరికి మండోదరి కుదేలయిపోయింది.

"అదేమిటి డాక్టర్? కడుపులో బల్లలు, కుర్చీలు పెరగటానికి నేనేమైనా సివిల్ ఇంజనీర్నా?" అంటూ గట్టిగా అరిచాడు రామారావు.

"నువ్వు నిజంగానే గవర్నమెంట్ ఇంజనీరువయితే ఎప్పుడో జీర్ణంచేసుకోగలిగేవాడివి. కాదు కాబట్టే మీ ఆవిడకు కడుపు రూపంలో దాపురించింది." డాక్టర్ ముసిముసి నవ్వులు నవ్వింది.

"అయితే ఇప్పుడేం చెయ్యటం?" అడిగాడు.

"ఆపరేషన్ చేసి బయటకు తీస్తాను. ఆ బల్ల మీ ఇంట్లో వేసుకోండి" అంటూ మళ్ళీ జోక్ చేసింది డాక్టర్.

ఆరు వేలు తగలేసి ఆపరేషన్ చేయించుకుంది మండోదరి. ఆమె కడుపు మంట మరింత పెరిగింది.

"ఏమండీ! మనం జంతర్ మంతర్ స్వామివార్ని కలుద్దామండి. ఆయన దగ్గరకు వెళితే సంతాన ప్రాప్తి త్వరగా కలుగుతుందిట."

"ఏం? నా మీద నమ్మకం పోయిందా?"

"ఛ! అది కాదండి. ఆయన దగ్గర మహిమలున్నాయట. ఆయన చెయ్యి వేస్తే చాలు అన్నీ ఇట్టే అయిపోతాయిట."

"అదేమిటి? నేను ఇన్ని చేస్తే కానిది ఆయన చెయ్యేస్తేనే ఎలా అవుతుంది?"

"మీదంతా వితండ వాదం. నా మాట విని బయలుదేరండి" అంటూ పట్టుబట్టింది.

"మరైతే నాకు పిల్లలు పుట్టేది ఎలాండి?" అడిగింది మండోదరి.

"ముందు నువ్వు సైజు తగ్గించి స్మార్ట్‌గా తయారవ్వు. అప్పుడు బల్లలకు బదులు పిల్లలు పుడతారు" కసిగా సలహా ఇచ్చాడు.

అదే నిజమనుకుని మర్నాడే మండోదరి బ్యూటీ పార్లర్‌కి వెళ్ళింది. అక్కడో బక్కపల్చగా వున్న యువతిని చూపిస్తూ బ్యూటీషియన్‌తో అంది – "నన్నూ ఆ అమ్మాయంత సన్నగా చెయ్యండి."

"ఆ అమ్మాయి జబ్బుమనిషి. నిన్ననే రెండు బాటిళ్ళు గ్లూకోజు ఎక్కించారు" అంది పార్లర్ మహిళ.

"అయినా పర్వాలేదు. నేనూ అంతే నాజూగ్గా వుండాలనుకుంటున్నాను." తొణక్కుండా అంది.

"తప్పకుండా. కానీ ఫీజు మాత్రం రెండు వేలు అవుతుంది."

నెల తిరిగేసరికి నిజంగానే మండోదరి పీలగా కాకపోయినా సైజు మాత్రం తగ్గిపోయింది. మాట కూడా నూతిలో గొంతుకులా వస్తోంది. మిషన్ మీద కసరత్తులు చేయటం వల్లేమో నడకలో కూడా మార్పు వచ్చింది. మునుపు కడుపు ముందుకు, కాళ్లు వెనక్కు పోతూండేవి. ఇప్పుడు అన్నీ బ్యాలెన్స్ అయ్యాయి. ఆనందం పట్టలేక భర్తతో – "చూశారా! బ్యూటీ పార్లర్ మహిమ. ఎంతగా మారిపోయానో" సంబరంగా అంది.

"ఇంకా కొన్నాళ్లు ఇలానే కొనసాగించావంటే నుంచుంటే లేవలేవు. లేస్తే కూర్చోలేవు. నువ్వు సన్నపడింది పార్లర్ వల్ల కాదు. దాని ఫీజు వల్ల"

"అదెలాండి?"

"పొదువు పుణ్యమాని పూర్వంలా మేత మెయ్యటం లేదుగా! అందుకే సన్నపడ్డావు. ఇంకా ఇలానే చేస్తూ పోయావంటే ఈసారి బ్యూటీ పార్లర్‌కు కాదు, బ్లడ్ బ్యాంకుకు పైకం కట్టాల్సి వుంటుంది. నా మాట విని ఆ పార్లర్‌కు వెళ్లటం మానెయ్యి. లక్షణంగా ఇంట్లోనే మితంగా తిను. కాస్త పనీ పాటా చెయ్యి. అయినా పిల్లలు లేకపోతే ఈ దేశం గొడ్డుపోతుందా?" అక్కసుగా అన్నాడు.

"ఎందుకండి అలా కోపం తెచ్చుకుంటారు? అందరికీ వుంది, మనకు లేనిది అదే కాబట్టి మనల్ని చులకన చేయటానికి అలా అడుగుతారు."




"పుట్టరు అని చెప్ప. ఏం తప్పా?" బాధగా అన్నాడు.

"పోనీ మన ఫ్యామిలీ డాక్టర్ని కలిస్తే!"

"వాడ్ని కలిసినా పుట్టరు. వాడికే లేరు, నీకేం పుడతారు?"

"మీరు 'డాక్టర్ని కలవటమన్నా' పెడర్థాలు లాగుతారు. కలవటమంటే ఆయన్ని సంప్రదించి మనకు పిల్లలు పుడతారో లేదో తెలుసుకోవచ్చుగా అని."

ఆమె కన్నీళ్లకు రామారావు కరిగిపోయాడు.

"మండూకం! మనకు లేని దాని గురించి మనం ఎప్పుడూ దిగులు పడటం, ఎదుటివారికున్న దాని గురించి ఎప్పుడూ ఆలోచిస్తూ అసూయచెందటం మంచిది కాదు. నీకు పిల్లలు లేనంత మాత్రాన ఏం సుఖం తక్కువయిందని? ఉన్నవాటిని చూసి ఆనందించటం నేర్చుకో."

"అయినా నాకు తెలియక అడుగుతాను – తొమ్మిది నెలలు కడుపు మోయటం, పుట్టిన వాడ్ని పెంచటం, పోషించటం, ఏడుపులు, మొత్తుకోళ్లు ఇవన్నీ ఎందుకట?

"అదేమిటండి. పిల్లలు కంటికి వెలుగులు..."

"ఇంటికి చెదపురుగులు" అంటూ ఆమె మాటలు కట్ చేస్తూ "సినిమా డైలాగులు చెప్పకు. పిల్లలు లేనిదానికంటే లేరనే నీ భావనే నిన్ను ఎక్కువగా వేధిస్తోంది. ముందు దాని నుంచి బయట పడు."

"కొరగాని కొడుకు వుండేకన్నా తల కొరివి పెట్టేవాడు లేకపోతేనే నయం. ఇప్పుడు మన ఇంటికి ఎవరైనా రావాలంటే ఆనందంగా వస్తున్నారు. అదే రేపు ఓ పిడుగు పుడితే, ఎక్కడ తమ వళ్లో చేరి బట్టలు తడుపుతాడోనని భయపడి చస్తారు. పిల్లల్ని ఎత్తుకుని మనం ఎవరింటికైనా వెళితే అంటరానివాళ్లను చూసినట్టు దూరంగా వుంచుతారు. మనం ఇంట్లో అడుగుపెట్టగానే ఇల్లు ఖాళీచేసే వాళ్లలా సామానంతా సర్దేస్తారు. అలానే వుంచితే మన పిడుగుగాడు ఒక వస్తువును పడేసి వస్తువులు చేసి వింత వింత పదార్థాలు సృష్టిస్తాడు. ఇప్పుడు మనం గ్యాస్ స్టవ్‌లు, ఎయిర్ కూలర్‌లు పెట్టుకుని హాయిగా వున్నాం. రేపు వాడు పెద్దవాడయి చదువుకున్నా చదువుల కోసం నగానట్రాతోపాటు ఇవన్నీ అమ్మాల్సిందే. జులాయి వెధవయి పక్కింటమ్మాయి జడ లాగి, ఏదురింటి విలన్‌తో ఫైటింగులు చేసి, రౌడీ టులో పేరు నమోదు చేయించుకుని జైలుకు పోయి, ఇలా రోజుకో అవతారమెత్తుతుంటే మనకు చూడ కళ్లులేక శాశ్వతంగా మూసుకుపోతాయి" అంటూ రామారావు ఏకరవు పెడుతూంటే మండోదరికి కళ్లు బైర్లు కమ్మాయి.

"ఈ జన్మకే కాదు, మరుజన్మకి కూడా పిల్లలొద్దు" మండోదరి కళ్లొత్తుకుంటూ అంది.

రామారావు గొంతు జీరబోయింది. ◆